వరి కోత.. కూలీల కొరత

- ఎకరం వరి కొతకు కూలీలకు రూ.3 వేలు
- యంత్రాలతో కాస్త తగ్గనున్న ఖర్చు
- కూలీల కొరతతో యంత్రాల వైపే రైతుల మొగ్గు
- ఫలితంగా పశుగ్రాసానికి ఇబ్బందులు


కొమరారంలో కోత దశకు వచ్చిన వరి పంట

ఇల్లెందు: ఖరీఫ్ వ్యవసాయ సీజన్‌లో వరి కోతలు మొదలయ్యాయి. ఈక్రమాన కూలీల కొరత కారణంగా యంత్రాలు పోటీ పడి కోతలు సాగిస్తున్నాయి. ఏటేటా కూలీల రేట్లు పెరుగుతున్నాయి. దీనికి తోడు కూలీల సంఖ్య తగ్గిపోయింది. ఫలితంగా రైతులు గడ్డి లభించకపోయినా యంత్రాలు ఉపయోగించి కోతలు చేసుకుంటున్నారు. ఎకరం వరి సాగు చేస్తే రూ.25 నుంచి రూ.30 వేలు ఖర్చు అవుతుంది. ఇక కూలీలతో కోతకు రూ.3వేల నుంచి రూ.5వేల వరకు ఖర్చు అవుతుండగా, యంత్రాలతో చేస్తే రూ.2,500 నుంచి రూ.3వేల వరకు వెచ్చించాల్సి వస్తోంది. కాగా, కూలీలతో కోయిస్తే గడ్డి మిగులుతుండగా, యంత్రాలతో మాత్రం ఆ అవకాశం లేదు.

మండలంలో 30వేల ఎకరాలకు పైగానే సాగు

ఇల్లెందు మండలంలో 7,200వేల ఎకరాల్లో మాగాణి, 25 వేల ఎకరాల మెట్ట విస్తీర్ణం సాగవుతుంది. మండలంలో 36 చెరువులు, కుంటలుండగా, వీటి క్రింద 3 వేల ఎకరాలు సాగవుతోంది. వాగులు, మడుగులు, బోర్లతో కలుపుకొని 2,500 వేల విద్యుత్ కనెక్షన్‌లున్నాయి. రాఘబోయినగూడెం, సుదిమళ్ల, కొల్లాపురం, చల్లసముద్రం, కొమరారం, పోలారం చెరువుల క్రింద వరి సాగుబడి అయ్యింది. గత 10 రోజులుగా ఆయా చెరువులు, కుంటల క్రింద ముమ్మరంగా వరి కోతలు సాగుతున్నాయి. ఉదయం 8 గంటల నుంచి సాయంత్ర 5 గంటల వరకు కూలీలు కోతల్లో నిమగ్నమవుతున్నారు. కొంత మంది దినసరి కూలీలుగా మరికొంత మంది గుత్తా లెక్కన కోతలు సాగిస్తున్నారు. ఎకరం వరి కోత పట్టి కుప్ప వేస్తే రూ.5 వేల నుంచి రూ.6 వేల వరకు పొందుతున్నారు. ఎకరం కోతకు 10 మంది నుంచి 15 మంది కూలీలు పని చేస్తున్నారు. ఇదిలా ఉండగా చైన్ యంత్రం ద్వారా కోత జరిపిస్తే రూ.3,500 వరకు, టైర్ల యంత్రంతో కోత జరిపిస్తే రూ.2,500 నుంచి రూ.3వేల వరకు తీసుకుంటున్నారు. యంత్రాలను ఉపయోగిస్తే పశువులకు మేత కరువు అవుతుంది. అదే కూలీలతో కోత జరిపిస్తే అదనపు ఖర్చు అవుతుంది. అదనపు ఖర్చు భరించి పశువులకు గ్రాసం దక్కించుకుందామంటే వర్షాలు, మబ్బులు నష్టాలకు గురి చేసే అవకాశం ఉంది. ఏదిఏమైనా వరికి ఒక వైపు కూలీలు, మరొక వైపు యంత్రాలు పోటీపడుతున్నాయి.

యంత్రాలతో ఎక్కువ ఖర్చు..



వరి కోతకు కూలీలు కొరత తీవ్రంగా ఉంది. యంత్రాలను ఉపయోగిస్తే అధిక ఖర్చు అవుతుంది. అయితే కూలీల కోతల వల్ల కోత వరకే ఒక కూలీ రేటు ఉంటుంది. ఇక కట్టి కుప్పలు వేస్తే మరో కూలీ, ఇక నూర్పిడికి ఇంకో కూలీ చెల్లించాల్సి ఉంది. దీని వల్ల గడ్డి మిగులుతుంది, కానీ ఖర్చు డబుల్ అవుతుంది. దీని వల్ల రైతులు యంత్రాల వైపు చూస్తున్నారు.

– మోతీలాల్, కొమరారం

పశువులు ఉంటే కూలీలతోనే మేలు



వరి పంట పండించే రైతులు పశువులు ఉంటే కూలీలతో కోతలు పట్టించుకోవాలి. పశువులు లేని రైతులు అయితే యంత్రాలతో కోతలు పట్టిస్తే ధాన్యానికి ఎటువంటి నష్టం లేకుండా ఇంటికి చేరుతుంది. హార్వెస్టర్‌తో వరి నూర్పిడి చేస్తే కొంత వడ్లు పొలంలోనే రాలిపోతాయి. ఒక్క ఎకరం సాగు చేస్తే సుమారు రూ.25 వేలు పైగా ఖర్చు అవుతుంది.

– మూతి వెంకట నర్సు, పూబెల్లి

క్లుప్తంగా

విద్యార్థులు లక్ష్యాలను చేరుకోవాలి

పాల్వంచ: విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను అధిరోహించాలని కేటీపీఎస్ 7వ దశ ఎస్ఈ ఎస్.యుగపతి అన్నారు. సివిల్ ఇంజనీర్స్ హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో పునుకుల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ గైడ్స్, మైక్రోస్కోపీ అందించారు. తాగునీటి పైపులైన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడారు. కార్యక్రమంలో ఈఈలు కిషోర్, రవీందర్, డీఈటీ ఎస్ఎస్ఎస్ శంకర్, ఏడీఈ మధు బాబు, హెడ్‌మాస్టర్ శ్రీహరి పాల్గొన్నారు.

రెగ్యులరైజ్ చేయాలి


నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

పాల్వంచ: సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని టీఎస్ఎస్‌యుఎస్ సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి భట్టు చందు అన్నారు. మంగళవారం స్థానిక కస్తూర్బా గాంధీ పాఠశాలలో మధ్యాహ్న భోజన సమయంలో సంఘం ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. చందు మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని తక్షణమే అమలు చేయాలని, లేదంటే డిసెంబర్ మొదటి వారంలో నిరవధిక సమ్మెకు వెళ్తామన్నారు. కనీస వేతనాలు ఇవ్వకపోవడంతో బాధాకరం అన్నారు. పే స్కేల్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో కిషన్, దుర్గ, గంగరాజు, అనిత, సరోజ, మాధవి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైద్యశిబిరం

పాల్వంచరూరల్: పాండురంగాపురం సబ్‌సెంటర్ పరిధి రాజీవ్‌నగర్ ఎస్టీ కాలనీలో మంగళవారం ఉల్వనూరు పీహెచ్‌సీ వైద్య సిబ్బంది హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా సికిల్ సెల్ రక్తపరీక్షలు నిర్వహించారు. వైద్యసిబ్బంది, హెల్త్ సూపర్‌వైజర్ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ మహాసభలను జయప్రదం చేయండి..

సింగరేణి(కొత్తగూడెం): విద్యారంగ సమస్యల సాధన కోసం ఫిబ్రవరి 5,6 తేదీలలో ఎస్ఎఫ్ఐ నిర్వహించే మహాసభలను జయప్రదం చేయాలని, నలంద విద్యాసంస్థల అధినేత ఎంవీ చౌదరి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కళాశాలలో మహాసభ సన్నాహక సమావేశం నిర్వహించి ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేశారు. చౌదరి మాట్లాడుతూ దేశంలో శాస్త్రీయ విద్యావిధానం కోసం విద్యారంగంలో వస్తున్న తిరోగమన భావజాలంపైన ఎల్లప్పుడూ పోరాటాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 55 ఏళ్లుగా ఎస్ఎఫ్ఐ అనేక పోరాటాలు చేసిందని, దేశంలో విద్యారంగ పరిరక్షణకు ఎస్ఎఫ్ఐ కృషి ఎనలేనిదన్నారు. ఎస్ఎఫ్ఐ పూర్వవిద్యార్థులు అనురాధ, రాజు, డీవైఎఫ్ఐ నాయకులు, సీపీఎం, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.

'గృహజ్యోతి' వర్తింపజేయాలి

జూలూరుపాడు: అర్హులందరికీ గృహజ్యోతి పథకాన్ని వర్తింపజేయాలని కోరుతూ బీఎస్పీ, ప్రజాసంఘాల నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం జూలూరుపాడు విద్యుత్‌శాఖ ఏఈ సతీష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఎస్పీ మండల అధ్యక్షుడు తంబర్ల నరసింహారావు, భారతీయ గోర్ బంజా పోరాట సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బానోత్ దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా ఎంతోమంది నిరుపేదలకు గృహజ్యోతి పథకం వర్తించక ఇబ్బంది పడుతున్నారని, 200 యూనిట్ల ఉచిత కరంటు అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. జెట్రిపోతుల నరేష్ కుమార్, బడుగు వీరస్వామి, భూక్యా నరసింహారావు, బాబూలాల్, పృథ్వీ పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పిస్తాం


కొత్తూరులో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందురూరల్: ప్రతీ పల్లెలో మౌలిక వసతులు కల్పనతోపాటు మహిళల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పలు సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. మండలంలోని పలు గ్రామాలలో ఎన్ఆర్ఈజీఎస్ పథకంలో భాగంగా రూ.37 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రహదారుల నిర్మాణ పనులకు సుదిమళ్ల గ్రామపంచాయతీ కొత్తూరు గ్రామంలో, మాణిక్యారం గ్రామపంచాయతీ మర్రిగూడెం గ్రామంలో సీఆర్ఆర్ నిధుల నుంచి రూ.25 లక్షల వ్యయంతో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు కోసం ప్రభుత్వం ప్రణాళికా బద్ధంగాముందుకు సాగుతోందన్నారు. ప్రతిపక్షాల మాటలు నమ్మొద్దు, ప్రభుత్వ పనితీరును గమనించి విశ్వసించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ ధన్‌సింగ్, ఎంపీఓ చిరంజీవి, ఏపీఎం దుర్గారావు, ఏపీఓ శంకర్, కాంగ్రెస్ నాయకులు పులి సైదులు, చీమల నాగరత్నమ్మ, కల్తి పద్మ, మోకాళ్ల వెంకటమ్మ, మండల రాము, పూనెం సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

అబ్బయ్యకు నివాళి...

మాజీ ఎమ్మెల్యే ఊకే అబ్బయ్య కుటుంబాన్ని ఎమ్మెల్యే కోరం కనకయ్య మంగళవారం పరామర్శించారు. అబ్బయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి ఓదార్చారు.

టేకులపల్లి: ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య మంగళవారం టేకులపల్లి మండలంలో పర్యటించారు. ఉపాధి హామీ పథకం నిధులు రూ.40 లక్షలతో శంభునిగూడెం, చంద్రుతండా, కొత్తతండా(జి) గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీ నిర్మాణాలకు శంకుస్థాపన చేసి, సులానగర్ గ్రామంలో పశువుల షెడ్డుని ప్రారంభించారు. అనంతరం బేతంపూడి సొసైటీ ఆధ్వర్యంలో బొమ్మనపల్లిలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. టేకులపల్లి క్యాంపు కార్యాలయంలో 29 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ విద్యాచందన, ఎంపీడీఓ రవీంద్రరావు, సొసైటీ చైర్మన్ లక్కినేని సురేందర్‌రావు, డీటీ ముత్తయ్య, ఏవో అన్నపూర్ణ, సొసైటీ డైరెక్టర్లు పాల్గొన్నారు.

మైనార్టీ గురుకులంలో తనిఖీ


తనిఖీ చేస్తున్న అధికారుల బృందం

ఇల్లెందు: మండల స్థాయి అధికారుల బృందం మంగళవారం పట్టణంలోని మైనార్టీ గురుకుల బాలుర జూనియర్ కళాశాలలో ఆకస్మిక తనఖీ చేశారు. తహసీల్దార్ కోటా రవికుమార్, ఎంపీడీఓ ధన్‌సింగ్, ఎంఈఓ టీవీఆర్ఎస్ స్వామి ఆహారం రుచి, నాణ్యత, కళాశాల, పాఠశాలల ఆవరణ, గదుల్లో పరిశుభ్రత, వంటశాలలో సదుపాయాలు, డైనింగ్, తరగతి, నివాస గదులు, మరుగుదొడ్లు, స్నానపు గదులు, మూత్రశాలలను పరిశీలించారు. ఇక కళాశాలలో విద్యుత్, లైటింగ్, ఫ్యాన్లు, ఇతర సదుపాయాలను పరిశీలించారు. ఎంఈఓ స్వామి మాట్లాడుతూ... ఉన్నతాధికారులకు నివేదిక అందజేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యాలయాల్లో సదుపాయాలు లేవని విద్యార్థులు, విద్యార్థి సంఘాలు ఆందోళనలు ఉధృతం చేసిన సందర్భంగా ప్రభుత్వం మండల స్థాయి అధికారుల బృందాలచే తనిఖీలు చేపట్టాలని ఆదేశించింది. ప్రభుత్వ సూచనతో కలెక్టర్‌లు మండల స్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి ఆదేశాలు జారీ చేశారు. మండలంలోని ఎస్టీ, ఎస్సీ, బీసీ హాస్టళ్లు, గురుకులాలు, ఇతర విద్యాలయాలను తనిఖీ చేయాలని సూచించగా తొలిరోజు మైనార్టీ గురుకులం తనిఖీ చేసినట్లు వెల్లడించారు. అన్ని విద్యాలయాలు వరుస క్రమంలో తనిఖీలు చేసి ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తామని తెలిపారు.

అన్ని ప్రాంతాల అభివృద్ధే ధ్యేయం

జూలూరుపాడు: రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అన్నారు. మండలంలోని గాంధీనగర్, గంగారం తండా గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి మంగళవారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. గాంధీనగర్‌లో ఉపాధి హామీ నిధులతో రైతు రాందాస్ నిర్మించిన పశువుల షెడ్‌ను ప్రారంభించారు. కాగా సీసీ రోడ్ల నిర్మాణాల శంకుస్థాపనకు శిలాఫలకాలు ఏర్పాటు చేయకపోవడంతో పంచాయతీరాజ్ వర్క్ ఇన్‌స్పెక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల్లో మాట్లాడుతూ.. అర్హులైన రైతులందరికీ రుణమాఫీ చేయడంతో పాటు నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయనున్నట్లు చెప్పారు. అలాగే జూలూరుపాడులో రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి, ఎంపీఓ తులసీరామ్, పశువైద్యాధికారి బానోత్ బద్దూలాల్, ఎంఈఓ బానోత్ జుమ్కీలాల్, గిర్దావర్ తిరుపతిరావు, ఏపీఓ రవికుమార్, కాంగ్రెస్ నాయకులు లేళ్ల వెంకటరెడ్డి, మాలోత్ మంగీలాల్ నాయక్ పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి..


మాట్లాడుతున్న రమేష్

ఇల్లెందు: ఇల్లెందు వేదికగా తొలిసారి సీపీఎం జిల్లా మహాసభలు జరగబోతున్నాయని, ఈ మహాసభలను విజయవంతం చేయటమే ఇక్కడి కార్యకర్తలు, నాయకులు లక్ష్యంగా ముందుకు సాగాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఏజే రమేష్ అన్నారు. మంగళవారం ఇల్లెందులోని ఏలూరి భవన్‌లో సీపీఎం మండల కమిటీ వర్క్ షాప్ కార్యక్రమం సుల్తానా అధ్యక్షతన జరిగింది. రమేష్ మాట్లాడుతూ.. తొలిసారి ఇల్లెందు వేదికగా మారబోతుందన్నారు. సీపీఎం కరుడు కట్టిన సిద్ధాంతం కలిగిన పార్టీ అన్నారు. దేశ రాష్ట్ర రాజకీయాలతో పాటు అంతర్జాతీయ రాజకీయాలపై కూడా స్పష్టత ఉంటుదన్నారు. రాబోయే కాలంలో జిల్లా ప్రజల సమస్యలు, సమరశీల పోరాటాలకు, ఉద్యమాలకు ఈ సభల్లో చర్చించి కార్యాచరణ రూపొందించటం జరుగుతుందన్నారు. అనంతరం మహాసభల విజయవంతానికి కార్యదర్శి రిపోర్టును ప్రవేశ పెట్టారు. ఈ సమావేశంలో కృష్ణ, మోహన్‌రావు, ఖాదర్, సంధ్య, మరియా, మదారపు వెంకటేశ్వర్లు, అబ్బాస్, మొలుగు శ్రీనివాస్, కొడెం బోస్, తాళ్లూరి పద్మ, కదారి వెంకటమ్మ, సత్యనారాయణ కోరీ, వెంకన్న, సుజాత, సంతోష, కమల, హసీనా, సాధిక్, శ్రీనివాస్, యాకమ్మ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట రైతు సంఘాల ధర్నా


ధర్నా చేస్తున్న రైతులు, కార్మికులు, నాయకులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్ విధానాలను ప్రతిఘటించాలని, రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికుల హక్కుల కోసం సమరశీల పోరాటాలను ఉధృతం చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా, జాయింట్ ఫ్లాట్‌ఫాం ఆఫ్ ట్రేడ్ యూనియన్ నాయకులు పిలుపునిచ్చారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట మంగళవారం కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఏఐకేఎస్, ఏఐకేఎంఎస్, ఏఐపీకేఎంఎస్, ఇఫ్టూ, యూసీఐ తదితర సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ.... కేంద్రలోని బీజేపీ ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్లకు కట్టబెడుతోందని విమర్శించారు. పంటల గిట్టుబాటు ధరచట్టం చేయాలని డిమాండ్ చేశారు. ముత్యాల విశ్వనాథం, కె.బ్రహ్మాచారి, గుమ్మడి నర్సయ్య, సారంగపాణి, రంగారెడ్డి, యాకూబ్‌షావలీ, సాబీర్‌పాషా, ఊక్లా నాయక్, కున్సోత్ ధర్మా, రైతు సంఘాల నాయకులు రేపాకుల శ్రీనివాస్, పూర్ణచందర్‌రావు, తుపాకుల నాగేశ్వరరావు, రామ్మూర్తి, వంశీకృష్ణ, ఎ.సత్యనారాయణ, డి.లక్ష్మీనారాయణ, కె.వెంకటేశ్వర్లు, అమర్‌సింగ్, జమలయ్య, ప్రసాద్, చిరంజీవి పాల్గొన్నారు.

జరిమానా రద్దు చేయండి..


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

టేకులపల్లి: సెంట్రల్ ట్రేడ్ యూనియన్ ఇండియా టీయూసీఐ అనుబంధ సంస్థ ప్రగతిశీల సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ దశల వారి పిలుపులో భాగంగా మంగళవారం టేకులపల్లిలోని హైటెక్ కాలనీ కాంట్రాక్టు కార్మికుల మస్టర్ అడ్డా వద్ద సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సింగరేణి సివిల్ ఇన్‌చార్జ్‌కి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ యాకుబ్‌షావలీ, టీయూసీఐ టేకులపల్లి ఏరియా కార్యదర్శి జరుకుల సుందర్ మాట్లాడుతూ.. సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులు డ్యూటీకి హాజరు కాకపోతే గైర్హాజరుగా పరిగణించాలి కానీ జరిమానా విధించి ముక్కు పిండి వసూలు చేస్తున్నట్లు చెప్పారు. పలుమార్లు యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా పెనాల్టీలు రద్దు చేయడం లేదని వాపోయారు. పెనాల్టీల వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. సింగరేణిలో కాంట్రాక్టు కార్మికుల ఓట్లతో గెలిచిన ప్రజాప్రతినిధులు, ఈ పెనాల్టీల రద్దు విషయంలో పట్టించుకోవడం లేదన్నారు. జీతాలు పెరగక కార్మికులు దుర్భరమైన జీవితం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మోటార్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాయం వెంకన్న, కాంట్రాక్టు కార్మికుల నాయకులు షఫీ, శివ, బాలు, ఉప్పయ్య, నాగమణి, ఎర్రమ్మ పాల్గొన్నారు.

ఏబీకేఎంఎస్ వార్షిక మహాసభ

సింగరేణి(కొత్తగూడెం): వచ్చే ఫిబ్రవరిలో రామగుండంలో ఏబీకేఎంఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 19వ త్రైవార్షిక మహాసభను జయప్రదం చేయాలని ఆ సంఘం జాతీయ నాయకులు పి.మాధవ నాయక్ పిలుపునిచ్చారు. మంగళవారం కొత్తగూడెంలోని బీఎంఎస్ కార్యాలయంలో కేంద్ర ఉపాధ్యక్షులు బి.రాంసింగ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాసభలకు దేశ వ్యాప్తంగా బొగ్గు పరిశ్రమల్లోని 1000 మంది బీఎంఎస్ యూనియన్ కార్యకర్తలు, ప్రతినిధులు, జాతీయ నాయకులు హాజరవుతున్నారని తెలిపారు. యూనియన్ కార్యకర్తలు, నాయకులు మన ఇంట్లో శుభకార్యంలా భావించి జయప్రదం చేయాలన్నారు. టీఎస్ పవన్‌కుమార్, చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వినయ్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.శ్రీనివాస్, కార్యాలయ కార్యదర్శి జీవీ కృష్ణారెడ్డి, నాయిని సైదులు, ఏరియా కార్యదర్శులు ఊట్ల గణేష్, నాగ ప్రసాద్, లీల కృష్ణ పిట్ సెక్రటరీ మల్లారెడ్డి, నాగేశ్వరరావు, అయిత రవి, వీర కుమార్, ఠాగుర్, కే.రాజేశ్, ఇసాక్, శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్


నృత్యం చేస్తున్న చిన్నారులు

ఇల్లెందు: పట్టణంలోని సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో ముందస్తుగా సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఫాస్టర్ రెవరెండ్ జాన్ బాబూరావు, వీరామణి అమ్మవారు మాట్లాడుతూ.. ఏటా చర్చి ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు జరుగుతుంటాయని తెలిపారు. ఈ సందర్భంగా చర్చి ఆవరణలో క్రిస్మస్ ట్రీ, నక్షత్రాన్ని విద్యుత్ వెలుగులతో అందంగా అలంకరించారు. ఏసు జనన వృత్తాంతాన్ని స్మరిస్తూ గీతాలను ఆలపించారు. చిన్నారులు ప్రదర్శించిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో సండే స్కూల్ సూపరింటెండెంట్ తమ్మిశెట్టి ప్రభాకర్, యూత్, పిల్లల కమిటీ సభ్యులు, సంఘం పెద్దలు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రం పరిశీలన

సుజాతనగర్: సొసైటీ ఆధ్వర్యంలో సుజాతనగర్‌లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కొత్తగూడెం వ్యవసాయ సంచాలకులు నరసింహారావు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 17 శాతం తేమ ఉంటేనే ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని, రైతులు తమ పొలాల్లోనే ధాన్యాన్ని ఆరబెట్టుకొని 17 శాతం తేమ వచ్చాకే కేంద్రానికి తీసుకరావాలన్నారు. తుఫాను ప్రభావం ఉన్నందున రైతులు పట్టాలు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. రైతులకు ఇబ్బంది కలగకుండా పట్టాలను అందుబాటులో ఉంచాలని సొసైటీ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏఓ జి.నర్మద, ఏఈఓలు శరత్, ప్రనూష, నరసింహా తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'ని సద్వినియోగం చేసుకోవాలి



చుంచుపల్లి: ఉపాధి పనులు ప్రారంభిస్తున్న అధికారులు, ఇల్లెందురూరల్: శంకుస్థాపన చేస్తున్న రైతు


పాల్వంచరూరల్: ప్రతిజ్ఞ చేస్తున్న డీపీఓ, మార్క్‌ఫెడ్ డైరెక్టర్లు

చుంచుపల్లి: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలో ఉపాధి పనుల జాతర కార్యక్రమాన్ని ప్రారంభించారు. చుంచుపల్లి మండలంలోని 18 గ్రామ పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ పనులను లాంఛనంగా చేపట్టారు. పెనగడప గ్రామంలో జరిగిన కార్యక్రమానికి హాజరైన ఎంపీడీఓ అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉపాధి కూలీలకు చేతి నిండా పని కల్పించాలనే ఉద్దేశంతో పనుల జాతరను నిర్వహిస్తోందన్నారు. ముందుగా ప్రణాళికలు సిద్ధం చేసిన పనులను సకాలంలో పూర్తి చేసేలా చూడాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ సత్యనారాయణ, కార్యదర్శి హనుమంతు, ఏపీఎం రఘుపతి పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా పేదలకు పనులు కల్పించడంతోపాటు ఉపాధి పెంపొందించుకునేలా అమలవుతున్న పథకాలను కూడా రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ధన్‌సింగ్ సూచించారు. రేపల్లెవాడ గ్రామపంచాయతీ కట్టుగూడెం గ్రామంలో క్యాటిల్ షెడ్డు నిర్మాణ పనులకు మంగళవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా రైతులకు అవసరమైన అనేక పథకాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ చిరంజీవి, ఏపీఎం దుర్గారావు, ఏపీఓ శంకర్, కార్యదర్శి మోహన్ పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి చంద్రమౌళి, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధి జగన్నాథపురం గ్రామంలో మంగళవారం ఉపాధి హామీ పథకం పనులను ప్రారంభించి, ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా గ్రామసభలో మాట్లాడారు. మహిళా శక్తి ఉపాధి భరోసా కింద ఉపాధి హామీ పథకం ద్వారా కోళ్ల పెంపకం, గేదెల షెడ్లు, అజోలాగడ్డి పెంపకం, పండ్ల మొక్కల పెంపకం మహిళలకు అందించడం జరుగుతుందన్నారు. మహిళల సంక్షేమం కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందన్నారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ బొగ్గ నారాయణ, ఏపీఓ పోరండ్ల రంగా, ఏపీఎం రాంబాబు, కార్యదర్శులు సాయిరాం, శ్రీహరి, యర్రంశెట్టి ముత్తయ్య పాల్గొన్నారు.

ప్రజాసేవలో భాగస్వాములు కండి..


కొత్తగూడెంఅర్బన్: కోర్టులో ప్రతిజ్ఞ చేయిస్తున్న ప్రధాన న్యాయమూర్తి


జూలూరుపాడులో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న వైరా ఎమ్మెల్యే రాందాస్

అందరూ రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా పనిచేస్తూ సమాజాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారు. మంగళవారం ప్రభుత్వ విద్యాసంస్థల్లో, కార్యాలయాల్లో, వివిధ సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వక్తలు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం ప్రజలందరికీ ప్రాథమిక హక్కులు కల్పించి, చట్టాలను రూపొందించిందన్నారు. ఇది దేశ సమగ్రతకు ఆయువు పట్టు అన్నారు. భారతదేశం ఆదర్శ దేశంగా నిలవడంలో అంబేద్కర్ పాత్ర ప్రశంసనీయమని కొనియాడారు. రాజ్యాంగం 75 సంవత్సరాల క్రితం నవంబర్ 26న ఆమోదింపబడిందని రాజ్యాంగ దినోత్సవం మనకు కేవలం ఒక పండుగ కాదని దేశంలోని ప్రతీపౌరుడు, హక్కులు, విధుల పట్ల అవగాహన కలిగి ఉండే రోజు అన్నారు. రాజ్యాంగ విలువలు కాపాడు తామని ప్రతిజ్ఞ చేశారు. – సాక్షి నెట్‌వర్క్


ఇల్లెందు: ప్రతిజ్ఞ చేస్తున్న సింగరేణి ఉద్యోగులు


సింగరేణి(కొత్తగూడెం): జీఎం కార్యాలయంలో మాట్లాడుతున్న జీఎం శాలేంరాజు


ఇల్లెందురూరల్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..


కొత్తగూడెంరూరల్: నివాళులర్పిస్తున్న ఎస్పీ


పాల్వంచ: గ్రంథాలయంలో..